క్లుప్తంగా

బస్సు డ్రైవర్ల కమిటీ ఎన్నిక



నర్సంపేట: నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సుల డ్రైవర్ల కమిటీని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరికెల మురళీకృష్ణ, కార్యదర్శిగా గుర్రపు రమేష్, ఉపాధ్యక్షుడిగా కట్ల ప్రశాంత్, కోశాధికారిగా ఎరుకల రాజు, సహాయ కార్యదర్శి వెనుకతల ఇంద్రయ్య, ఆలకుంట్ల శ్రీను, గొల్లపల్లి శ్రీకాంత్, బాషబోయిన అశోక్, బొల్లెపల్లి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులుగా దామెర భిక్షపతి, పూజారి వివేక్, జీ.భాస్కర్, డీ.గణేష్, అహ్మద్, గోపి, జీ.వేణు, ఏ.కళాధర్, సంపత్‌రావులను ఎన్నుకున్నారు.

మల్లిక్‌యాదవ్ మృతి తీరనిలోటు

నెక్కొండ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల ప్రధాన కార్యదర్శి దూదిమెట్ల మల్లిక్ యాదవ్ (38) అకాల మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మల్లిక్‌యాదవ్ అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దొంతి మండలంలోని రెడ్లవాడలో మల్లిక్‌యాదవ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి మల్లిక్ ఎంతో కృషి చేశారని అన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మల్లిక్ యాదవ్‌కు భార్య పద్మ, కుమార్తెలు కృష్ణవేణి, దీపిక ఉన్నారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, నర్సంపేట మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, నెక్కొండ, నర్సంపేట మండలాల అధ్యక్షులు బక్కి అశోక్, బానోతు లక్ష్మన్‌నాయక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ఉన్నారు.

ఆర్థిక సాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన బండి మానస ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందింది. దీంతో ఆమెతోపాటు 1997–98లో పదోతరగతి పూర్తి చేసిన మిత్రులు, నాటి ఉపాధ్యాయుడు మోర్తాల గోపాల్‌రావు, సర్పంచ్ కవిత తదితరులు మానస చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మానస పిల్లలకు రూ.25వేలు అందించారు. నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



గీసుకొండ: మండలంలోని కొనాయమాకులలో బతుకమ్మ చీరలను ఎంపీపీ భీమగాని సౌజన్య, సర్పంచ్ డోలె రాధాబాయి బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి 1,050 చీరలు రాగా.. పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం, బీఆర్‌ఎస్ నాయకులు డోలె చిన్ని, మండల కోఆప్షన్ సభ్యుడు రహీం, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదు

చెన్నారావుపేట : నిమ్మ చెట్లకు గడ్డిమందు స్ప్రే చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు నాంపల్లి శ్రీనివాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకున్న ఎకరం భూమిలో 18 నెలల నుంచి నిమ్మ చెట్లను పెంచుతున్నట్లు తెలిపారు. తన అన్న కుమారస్వామి కావాలని నిమ్మ చెట్లకు గడ్డి మందు పిచికారీ చేయించాడని ఆరోపించాడు. దీంతో చెట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అతడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని శ్రీనివాస్ కోరాడు.

కమిటీ ఎన్నిక

వర్ధన్నపేట: వర్ధన్నపేట ఏబీవీపీ నగర కమిటీని వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిబాబు, కార్యదర్శిగా శివమణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కష్టసుఖాల్లో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల దేవేందర్, కార్తీక్, అజయ్, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

'మహనీయులను మరువడం విచారకరం'

వర్ధన్నపేట: మహనీయుల విగ్రహాలను తొలగించడంలో చూపిన అత్యుత్సాహం పునఃప్రతిష్ఠలో లేదని, మహనీయులను మరవడం విచారకరమని మాజీ ఐపీఎస్ అధికారి, కాంగ్రెస్ నేత కే ఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేటలో సుందరీకరణ పేరుతో మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను తొలగించి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు.

మహిళా కూలీలకు 'ఉన్నతి'

- కుట్టు శిక్షణ ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- వంద రోజులు ఉపాధి పనులు చేసిన వారికి అవకాశం
- డీఆర్‌డీఏ, ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో ట్రైనింగ్
- టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలకు మార్గం
- నేడు శిక్షణ అనంతర అర్హత పరీక్ష.. సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణలో కుట్టిన దుస్తులు చూపిస్తున్న ఉపాధి కూలీలు, సర్పంచ్, ట్రైనర్ స్వరూప

గీసుకొండ: ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తూ, పేదరికంలో మగ్గుతున్న మహిళలకు ఉపాధి కల్పించడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, హసన్‌పర్తిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లు 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఈ కార్యక్రమం ద్వారా ఏడాదిలో వంద రోజులపాటు పనిచేసిన ఉపాధి హామీ కూలీలకు కుట్టు శిక్షణ పొందే అవకాశం కల్పించారు. మండలంలోని మరియపురంలో గత నెల 6న ప్రారంభమైన శిక్షణ బుధవారం ముగిసింది. ట్రైనర్ జి.స్వరూప ఆధ్వర్యంలో చిన్నపిల్లలు, మగ, ఆడవారికి కావాల్సిన దుస్తుల కుట్టు శిక్షణపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. గీసుకొండ మండలంలోని గ్రామాలతోపాటు నర్సంపేట ప్రాంతంలోని లక్నేపల్లి, మహేశ్వరం ప్రాంతాల నుంచి మహిళలు శిక్షణ తీసుకున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కుట్టు శిక్షణలో మెళకువలను నేర్చుకున్నారు.

పల్లెకు తరలిన శిక్షణ కార్యక్రమం..

శిక్షణ కార్యక్రమాలు సాధారణంగా హసన్‌పర్తి ఆర్‌ఎస్‌ఈటీఐలో నిర్వహిస్తారు. శిక్షణ పొందే వారికి అక్కడే భోజనం, బస ఏర్పాటు చేస్తారు. దీన్ని చాలా మంది దూరభారంగా భావిస్తున్నారు. శిక్షణ కాలంలో కుటుంబాలకు మహిళలు దూరంగా ఉండాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి తమ గ్రామంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళలు శిక్షణ తీసుకున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌ఎస్‌ఈటీఐలో కాకుండా ఓ గ్రామంలో నిర్వహించడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల అభినందనలు..

మరియపురంలో చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి తదితరులు పరిశీలించారు. సర్పంచ్ బాలిరెడ్డి స్వయంగా శిక్షణ కోసం ఫంక్షన్ హాల్ కిరాయి డబ్బులు ఇవ్వడంతోపాటు భోజనం, అల్పాహారం ఖర్చులో సగం మొత్తాన్ని భరించారు. దీంతో అధికారులు ఆయనను అభినందించారు.

టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు..

మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ కంపెనీ చిన్న పిల్లల దుస్తుల తయారీ యూనిట్లను నెలకొల్పుతోంది. ఇందులో పనిచేయడానికి మహిళలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో పాటు నెలకు రూ.14 నుంచి 30 వేల వరకు వేతనాలు ఇచ్చే అవకాశం ఉంది. ఉన్నతి కార్యక్రమం కింద శిక్షణ పొందిన వారికి ఉద్యోగం విషయంలో ప్రాధాన్యం ఇస్తారని అధికారులు అంటున్నారు. మరియపురంలో శిక్షణ పొందిన మహిళలకు గురువారం హసన్‌పర్తి ఆర్‌ఎస్‌ఈటీఐలో పరీక్ష నిర్వహించనున్నారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



నర్సంపేట: సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు



రాయపర్తిలో..

నర్సంపేట: గ్రామీణ తపాలా ఉద్యోగులు నర్సంపేట సబ్ పోస్టాఫీస్‌లో బుధవారం ఒక్క రోజు సమ్మె నిర్వహించారు. ఈ మేరకు సమ్మెలో భాగంగా విధులు బహిష్కరించారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ.శాబుద్దీన్ మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని, పెన్షన్‌తోపాటు అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ జీడీఎస్‌లకు అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. టార్గెట్స్ మేళా రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు అశోక్, శ్రీనివాస్, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, యాదగిరి, చందర్, రవి, సంపత్‌కుమార్, రత్నాకర్, రాజశేఖర్, కల్పన, అనూష, కృష్ణ, కిషోర్, యశ్వంత్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట తపాలా ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌పోస్ట్‌మాస్టర్ మౌలానా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మైస చందర్, చారి, అబిద్‌పాషా, సోమరాజు, అర్జున్, తరుణ్, మహేష్, నరేష్‌కుమార్, దీపిక, అనిత, మోహన్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్నేరుపై మూడు వారధులు

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఖానాపురం : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపురం : మున్నేరు వాగుపై మూడు వారధులు నిర్మించి ప్రజలు, రైతుల కోరికను నెరవేర్చనున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని రంగాపురం శివారులో పాకాల వాగుపై రూ.8 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ ఖానాపురం, చెన్నారావుపేట మండలాల ప్రజలకు వారధులు ఉపయోగపడనున్నాయని తెలిపారు. మున్నేరుపై రూ.34 కోట్లతో బ్రిడ్జిలు, చెక్‌డ్యాంల నిర్మించనున్నట్లు వివరించారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ ప్రకాశ్‌రావు, జెడ్పీటీసీ స్వప్న, శ్రీనివాస్‌గౌడ్, వెంకటనర్సయ్య, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం

చెన్నారావుపేట: అభివృద్ధిలో నియోజకవర్గాన్ని పరుగులు పెట్టించానని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేట శివారులోని పాకాల వాగుపై రూ.18.78 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం, వంతెన, బోజేర్వు శివారులో రూ.7 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తిమ్మరాయినిపహాడ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించారు. జెడ్పీటీసీలు బానోతు పత్తినాయక్, బత్తిని స్వప్న, ఓడీసీఎంఎస్ చైర్మన్‌గుగులోతు రామస్వామినాయక్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, ఎంపీపీ ప్రకాశ్‌రావు, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, రవి, బుర్రి తిరుపతి, బాల్నె వెంకన్న, కేతిడి వీరారెడ్డి, తూటి శ్రీనివాస్, జక్క అశోక్, సర్పంచ్‌లు కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, కొండవీటి పావని ప్రదీప్‌కుమార్, జున్నూతుల రాంరెడ్డి, కంది కృష్ణచైతన్యరెడ్డి ఉన్నారు.

నర్సంపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం దుగ్గొండి, నెక్కొండ మండలాలకు చెందిన పలువురు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

బీఆర్‌ఎస్‌ది ప్రజాసంక్షేమ పాలన



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే



గీసుకొండలో..

- ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట: తెలంగాణ ఆవిర్భావం నుంచి నేటి వరకు పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బుధవారం ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వగృహంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులు కావడంతోపాటు ఆపదలో అండగా నిలుస్తాడనే భరోసాతో పార్టీలో చేరుతున్నారని వారికి ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మన తెలంగాణలోని పథకాలను ఎందుకు ప్రవేశపెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్పారావు, ఎంపీటీసీ ఉమాదేవి, ఏఎంసీ డైరెక్టర్ రవీందర్‌రావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సూరారపు నిరంజన్, ఉప సర్పంచ్ కళింగరావు, నాయకులు గుడికందుల రాజు, యాకయ్య, బత్తిని రాజబాబు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

గీసుకొండ: మండలంలోని మనుగొండకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు రడం భరత్ ఆధ్వర్యంలో యాదవ సంఘం ఉపాధ్యక్షుడు నాగనబోయిన మల్లయ్య, వార్డు సభ్యులు ఓదేలు, కుమారస్వామి, నాగరాజు, నాయకులు మల్లేశం, మల్లయ్య, సుధాకర్, అయిలయ్య తదితరులు పార్టీలో చేరారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, సర్పంచ్‌లు ప్రకాశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అవకాశం

నెక్కొండ: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు కనీస ఫీజుతో రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని నెక్కొండ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వడ్డెబోయిన వెంకటరమణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఓపెన్‌లో ప్రవేశాలకు ఈ నెల 30వకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. పదో తరగతికి 2023 ఆగస్టు నాటికి 14 ఏళ్లు, ఇంటర్‌లో చేరేవారు పదో తరగతి ఉత్తీర్ణులై, 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. గరిష్ఠ వయోపరిమితి లేదని తెలిపారు.

16 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

అక్టోబర్ 16నుంచి ఓపెన్ ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్ 80745 04684ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శ్రీదేవి, నర్సయ్య పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు



పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీలు

వర్ధన్నపేట: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న కార్యక్రమానికి వెళ్లకుండా అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చేపల్లో వ్యాధులు, నివారణపై శిక్షణ



చేపపిల్లలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

సంగెం: చేపల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణ, నివారణ చర్యలు, చేపల చెరువు యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మామునూర్‌లోని పీవీ నరసింహరావు పశువైద్యవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ జి.గణేష్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్‌లో చేపల రైతులకు చేపల వ్యాధులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోపిపాడ్, హెల్మంథిస్ క్రిముల వలన చేపల్లో స్కిన్‌ఫ్లుక్, గిల్‌ఫ్లుక్, లెర్నియ, చేప పేనులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. చేపల్లో బ్యాక్టీరియాతో డ్రాప్సీ, తోక తెగుళ్లు, ఎరువు వ్యాధి లక్షణాలను గుర్తించే విధానం నివారణ మార్గాలను వివరించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి సౌజన్యంతో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా చేపపిల్లలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుదర్శన్, మత్స్య సహకార సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నల్లబెల్లి: నర్సంపేటలో డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో, బాలీబాల్ క్రీడల్లో రుద్రగూడెం కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారని పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్ రావు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ బాలుర, బాలికల విభాగంలో ఖో–ఖో రెండు జట్లు ప్రథమ స్థానంలో.. వాలీబాల్‌లో బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జూనియర్ బాలుర కబడ్డీలో ప్రథమ స్థానం నిలువగా బాలికల విభాగంలో ఖోఖోలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పానుగోటి రామరావు, గాదె రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు గాదె రణధీర్ రెడ్డి, మహ్మద్ అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కల్పన



బిట్స్‌లో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఖానాపురం: గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ కల్పన సూచించారు. ఈ మేరకు మండలంలోని కొత్తూరులో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి మందుల అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను సైతం ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచకపోతే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూస రమ, అశోక్‌యాదవ్, రజిత, సులోచన, సుమ, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో వైద్య శిబిరం

నల్లబెల్లి: మండలంలోని నందిగామలో నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శృతి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలడంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు విషజ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ సాంబమూర్తి, ఏఎన్‌ఎంలు జెస్సిక, అన్నమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నర్సంపేట రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛభారత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, కళాశాల సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారి వనజారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఏట సురేష్, పవనకుమారి, భానురేఖ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బస్ సర్వీస్ పునఃప్రారంభం

నల్లబెల్లి: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కొండాపూర్‌కు ఆర్టీసీ అధికారులు బుధవారం బస్ సర్వీస్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతమ్మ మాట్లాడుతూ.. ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇందు కోసం కృషి చేసిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన జగదీశ్ అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం పరామర్శించారు. జగదీశ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు హరిబాబు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

తండాబాటను విజయవంతం చేయాలి

రాయపర్తి: నేడు మండలంలోని తండాల్లో నిర్వహించే రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తండాబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తండాల్లో సమావేశం నిర్వహించి కార్యకర్తలను చైతన్యం చేశారు. అనంతరం మండలకేంద్రానికి చెందిన ముద్రబోయిన రమేష్ గుండెపోటులో మృతిచెందగా గోపాల్‌రావు పరామర్శించారు. అనంతరం గ్రామాల్లో మృతిచెందిన మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతు బంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, ఐత రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

గీసుకొండ: మండలంలోని 18 గ్రామపంచాయతీల క్రీడా ప్రాంగణాలకు మంజూరైన క్రీడా సామగ్రి(కిట్ల)ను ఎంపీపీ భీమగాని సౌజన్య, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు బుధవారం పంపిణీ చేశారు. కిట్‌లో క్రికెట్, వాలీబాల్, షటిల్, షాట్‌పుట్, టెన్నికాయిట్, టీ షర్టులు తదితర సామగ్రి ఉంది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం, తహసీల్దారు ఎండీ రియాజుద్దీన్, సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, పూండ్రు జయపాల్‌రెడ్డి, గోనె మల్లారెడ్డి, కేదాసి అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఆమోదించాలి

వర్ధన్నపేట: బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీల వర్గీకరణను బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఓటమికి మాదిగలంతా కృషి చేస్తారని ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ, మహబూబాద్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. ఈ నెల 7న అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు జరుగబోయే మంద కృష్ణమాదిగ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవబంర్ 7న హైదరాబాద్‌లో లక్ష మందితో మాదిగల విశ్వరూప మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాసాని గోపాల్, జిల్లా ధర్మయ్య, బిర్రు గోపాల్, తాళ్లపెల్లి రమేష్, సీనపెల్లి రాజు, భిక్షపతి, కొండేటి మహేందర్, సోమన్న, బాస్కర్, తుమ్మల కుమార్, మేడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి ఫ్లెక్సీ.. వివాదాస్పదం



సంగెంలో బొడ్రాయికి కట్టిన ఫ్లెక్సీ

సంగెం: గ్రామదేవత (బొడ్రాయి)కి బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వివాదాస్పద చర్చకు దారి తీసింది. సంగెం మండల కేంద్రంలో బుధవారం వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే ధర్మారెడ్డికి స్వాగతం పలికేందుకు యూత్ నాయకులు గ్రామదేవత(బొడ్రాయి) గ్రిల్స్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిని చూసిన ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజలు ఇదేమి చోద్యమని, దేవత గుడులకు సైతం పార్టీ ఫ్లెక్సీలు కట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇంగితజ్ఞానం లేకుండా అధికార దర్పం ప్రదర్శించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.